క్లుప్తంగా

సమాజ అవసరాల మేరకు సేవలు



మత్స్యకార మహిళలకు మౌత్ స్పీకర్లు అందిస్తున్న క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: సమాజ అవసరాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు చేయడంలో రోటరీ ముందుంటుందని కాకినాడ సీపోర్ట్సు డీజీఎం ఎంవీ సుబ్రహ్మణ్యం అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ సన్‌రైజ్ సేవా కార్యక్రమానికి గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మత్స్యకార మహిళలు వారి కుటుంబ పోషణకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి వీధి తిరుగుతూ గట్టిగా అరుస్తూ సముద్ర ఉత్పత్తులు విక్రయించి కుటుంబాన్ని పోషించుకుంటున్నారన్నారు. వారి సౌకర్యార్థం వారికి మౌత్ స్పీకర్స్ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఆధారం లేని మహిళలకు కుట్టు మెషీన్లు ఇస్తున్నారని అన్నారు. క్లబ్ అధ్యక్షుడు కమల్ సందీప్, కార్యదర్శి నగధర్, క్లబ్ లెర్నింగ్ ఫెసిలిటేటర్ ఎ.వి.రంగారావు, ఉమెన్ ఎంపవర్ చైర్‌పర్సన్ ఎం.విజయలక్ష్మి, వి. దుర్గా మహేష్, ఎ.వి.హరిప్రసాద్, వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవాలకు సహకరించండి



ఎమ్మెల్యే నానాజీకి వినతి పత్రం అందజేస్తున్న మాలకొండయ్య, రంబాల వెంకటేశ్వరరావు

కాకినాడ రూరల్: గణేష్ ఉత్సవంలో భాగంగా నిమజ్జనాలకు ఇబ్బందులు లేకుండా సహకరించాలని ఉత్సవ సమితి నాయకులు ఎమ్మెల్యే పంతం నానాజీని కోరారు. గుడారిగుంట నివాసంలో ఎమ్మెల్యేని సమితి కాకినాడ సిటీ, రూరల్ కన్వీనర్లు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, రంబాల వెంకటేశ్వరరావు తదితరులు గురువారం కలిసి వినతి పత్రం అందించారు. సిటీలో జగన్నాథపురం రెండు వంతెనల నడుమ వార్ఫ్ రోడ్డు వినాయక సాగర్‌లో నిమజ్జనానికి గతంలో ఇబ్బందులు తలెత్తాయని ఆ పరిస్థితి లేకుండా సహకరించాలని కోరారు. రూరల్ పరిధిలో సూర్యారావుపేట బీచ్‌లో పదేళ్లుగా నిమజ్జనోత్సవం జరుపుతున్నామని తెలిపారు.

డివిజన్ల వారీగా తాగునీటి పరీక్షలు చేయాలి

బోట్‌క్లబ్: రాష్ట్రంలోని పలు పట్టణాలు, నగరాలు, గ్రామాల్లో డయేరియా ప్రబలమైనందున స్మార్ట్ సిటీలో డివిజన్ల వారీగా తాగునీటి పరీక్షలు నిర్వహించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం ఒక ప్రకటనలో కోరారు. పలు ప్రాంతాల్లో 40 శాతం కుళాయి గొట్టాలు మురుగు కాలువల్లో ఉన్నాయన్నారు. అత్యధిక ప్రాంతాల్లో 25 శాతం లీకేజీ సమస్య లున్నాయన్నారు. ఈ పరిస్థితుల వల్ల చాలా మంది మున్సిపల్ నీరు తాగడం లేదని, అధికారులు సత్వర చర్యలు చేపడితే అతిసార బెడద ఉండదని ఆయన అన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్చాలి



చిన్నారులతో అంగన్‌వాడీలు

పెద్దాపురం: బడి ఈడు పిల్లలు పాఠశాలలోనే ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో 'గ్రాడ్యుయేషన్ డే', 'నే బడికి పోతా' కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎస్.ఉమాదేవి అన్నారు. మండలంలోని జె.తిమ్మాపురంలో గురువారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గ్యాడ్యుయేషన్ డే నిర్వహించారు. అనంతరం గ్రామంలో పాఠశాల సిబ్బందితో కలిసి నే బడికి పోతా కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఉమాదేవి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విద్యకు ప్రాధాన్యతమివ్వాల్సిన అవసరం ఉందన్నారు. పిన్న వయసు నుంచే విద్యాబుద్ధులు నేర్పేందుకు నే బడికిపోతా కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర వర్మ, ఏఎన్‌ఎం నాగమణి, లీలారాణి, పరంజ్యోతి, పాఠశాలల సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

తాళ్లరేవు: కోరంగి ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం పాతకోరంగిలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వైద్యురాలు ఎం.విజయ ప్రతిభ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

టెండరింక్‌లో టీడీపీ బోల్తా

- స్కేటింగ్ రింక్ కైవసానికి కుటిలయత్నం
- ఐక్యతతో తిప్పికొట్టిన సంఘ నాయకులు



కాకినాడలో నిర్మించిన వైఎస్సార్ స్కేటింగ్ రింక్

కాకినాడ: అంతర్జాతీయ ప్రమాణాలతో కాకినాడలో నిర్మించిన స్కేటింగ్ రింక్‌ను స్వాధీనం చేసుకోవడానికి అధికార పార్టీ తెలుగుదేశం చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. టెండర్ ప్రక్రియ ద్వారా ఏదో ఒకలా స్కేటింగ్ రింక్‌ను తమ అదుపులోకి తీసుకొని వాణిజ్యపరంగా నిర్వహించాలన్న ఆలోచనకు బ్రేక్ పడింది. రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ సభ్యులంతా ఐక్యతతో ఈ కుటిల యత్నానికి చెక్ పెట్టారు. వివరాల్లోకి వెళితే.. కాకినాడ వివేకానంద పార్క్ ఆవరణలో రూ.9.5 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో గత ప్రభుత్వం ఈ రింక్‌ను తీర్చిదిద్దింది. ఎన్నో ఏళ్లుగా అదే ప్రాంగణంలో రోలర్స్ స్కేటింగ్ అసోసియేషన్ ఈ రింక్‌ను నిర్వహిస్తోంది. తాజాగా అధునాతన సదుపాయాలతో దీనిని ఆధునీకరించారు. తాజాగా అధికారంలోకి వచ్చిన టీడీపీ నేతల కన్ను దానిపై పడింది. ఎలాగైనా ఈ ప్రాంగణాన్ని తమ స్వాధీనంలోకి తెచ్చుకోవాలని స్కెచ్ వేశారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి టెండర్ ప్రక్రియ పెట్టించారు. తమకు కావలసిన వ్యక్తుల ద్వారా టెండర్ వేయించి స్వాధీనం చేసుకోవడానికి విశ్వప్రయత్నం చేశారు. విషయం పసిగట్టిన స్కేటింగ్ క్రీడాకారుల తల్లిదండ్రులు, అసోసియేషన్ సభ్యులు చెక్ పెట్టేందుకు ముందుకు వచ్చారు. గురువారం జరిగిన టెండర్ ప్రక్రియలో అధికార పార్టీ మద్దతుతో వచ్చిన కాంట్రాక్టరుతో పాటు టెండర్లు వేశారు. అనంతరం బహిరంగ వేలంలో కూడా అసోసియేషన్ సభ్యులు చురుకైన పాత్ర పోషించారు. ఏడాది కాలానికి రూ.21.75 లక్షలకు అసోసియేషన్ సభ్యులే రింక్‌ను దక్కించుకున్నారు. ఊహించని ఈ పరిణామానికి టీడీపీ నేతలు విస్తుపోయారు.

స్కేటింగ్‌కు ప్రాధాన్యం

కాకినాడలో రోలర్ స్కేటింగుకు విశిష్ట ప్రాధాన్యం ఉంది. ఇక్కడ స్కేటింగ్ నేర్చుకున్న యువత స్పోర్ట్స్ కోటాలో ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు పొందారు. అంతర్జాతీయ ఖ్యాతిని కూడా ఆర్జించారు. పైగా క్రీడాకారుల కుటుంబ సభ్యులు అనేకమంది అత్యున్నత స్థాయిలో ఉన్న వైద్యులు, ఇంజినీర్లు, వ్యాపారవేత్తలు కావడంతో వారంతా ఏకమై స్కేటింగ్ క్రీడను కాపాడుకోవడానికి ముందుకు వచ్చారు. పాతికేళ్లుగా తమ స్వాధీనంలో ఉన్న ప్రాంగణం బయట వ్యక్తుల చేతుల్లోకి వెళితే స్కేటింగ్ క్రీడ దెబ్బతింటుందన్న ఆలోచనతో వారంతా ఐక్యంగా తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. ఈ వ్యవహారం కాకినాడలో చర్చనీయాంశంగా మారింది. గతంలో కూడా టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఓ షటిల్ కోర్టును చేజిక్కించుకున్న దాఖలాలు ఉన్నాయి. అదే వ్యక్తులు స్కేటింగ్ రింక్‌పై కన్ను వేయడంతో అసోసియేషన్ సభ్యులు అప్రమత్తమై తిప్పికొట్టారు. దీంతో ఈ ప్రాంగణాన్ని, స్కేటింగ్ రింకును సొంత ప్రయోజనాల కోసం వాడుకునేందుకు టీడీపీ వేసిన స్కెచ్ బెడిసికొట్టింది.

జాతీయ స్థాయిలో బిజినెస్ నెట్‌వర్క్ విస్తరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రోటరీ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ

బోట్‌క్లబ్: యువత లోకల్ బిజినెస్ నెట్‌వర్క్ సంస్థను ఏర్పాటు చేయడమేకాకుండా దానిని జాతీయ స్థాయిలో విస్తరించే చర్యలు చేపట్టాలని రోటరీ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ అన్నారు . స్థానిక మెయిన్‌రోడ్డులోని ఒక ఫంక్షన్ హాల్లో గురువారం లోకల్ బిజినెస్ నెట్ వర్క్ సంస్థ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సంస్థ కాకినాడ చాప్టర్ అధ్యక్షుడు అంకుర్ సురాన అధ్యక్షత వహించారు. యువత ఆలోచనకు పదును పెడితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు చేతుల మీదుగా సంస్థ లోగోను ఆవిష్కరించారు. రెడ్ క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, ప్రముఖ వైద్యుడు కళ్యాణచక్రవర్తి, చిట్నీడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్, అధికారులు



కలెక్టర్ షాన్ మోహన్‌ను కలిసిన కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటరావు



కలెక్టర్ షాన్ మోహన్‌తో వీసీ ప్రసాదరాజు

కాకినాడ సిటీ: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన షాన్ మోహన్ సగిలిని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, ఇతర అధికారులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో వివిధ విభాగాధిపతులతో కలెక్టర్‌ను కలిసిన కమిషనర్ వెంకటరావు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్య కుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, స్మార్ట్ సిటీ సూపరింటెండెంట్ ఇంజినీరు ఎం.వెంకటరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాస్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీ చరణ్, ఉద్యాన సహాయ సంచాలకుడు టీవీ శిరిల్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఈఈ మాధవి తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వీసీ

జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన షాన్ మోహన్ సగిలిని గురువారం జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు మర్యాదపూర్వకంగా కలిసారు. ఆయన వెంట రిజిస్ట్రార్ ఎల్.సుమలత ఉన్నారు.

డయేరియా నియంత్రణకు పటిష్ట ప్రణాళిక



స్టార్ డయేరియా క్యాంపెయిన్-2024పై మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

కాకినాడ సిటీ: డయేరియాను అదుపు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె వెంకటరావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్టార్ డయేరియా క్యాంపెయిన్-2024పై స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో శుక్రవారం ప్రజారోగ్య విభాగానికి చెందిన సిబ్బందితో కమిషనర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆగస్టు 30 వరకు ఈ ప్రచార, అవగాహన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. డయేరియా ప్రబలేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఇప్పటికే సర్వే చేశామన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇతర కేటగిరీలకు చెందిన ప్రజలకు డయేరియా ప్రబలకుండా తసుకోవలసిన జాగ్రత్తలు, ఎక్కడైనా డయేరియా జాడలు కలిపిస్తే తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై కూడా అవగాహన కల్పిస్తున్నామని కమిషనర్ వివరించారు. తమ సర్వే ద్వారా హైరిస్క్ కేటగిరీ కింద 1692 మంది గర్భిణులు, 1498 మంది బాలింతలను గుర్తించామన్నారు. 14,500 మంది ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించినట్లు వెల్లడించారు. ఇప్పటికే 5266 కుటుంబాలకు అవసరమైన సహకారాన్ని కూడా అందించామన్నారు. పరిశుభ్రమైనన ఆహారాన్ని తీసుకోవడం, చేతులను పరిశుభ్రంగా కడగడం, కాచి చల్లార్చిన నీళ్లు వాడడం, వేడిగా ఉండే ఆహారాన్ని భుజించడం, దోమలను అదుపు చేసే చర్యలు తీసుకోవడం, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై మురికివాడలోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జె.నరసింహనాయక్, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రవీణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రత్నకుమార్, కాకినాడ నగరపాలక సంస్థ ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీపీఎంవో డాక్టర్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

తేరుకున్న ఉప్పలంక

- 'సాక్షి' కథనంతో కదలిన యంత్రాంగం
- ఎంపీడీఓ చొరవతో పరిస్థితి మెరుగు
- ఇంజిన్లతో నీరు తోడిన సిబ్బంది



ఉప్పలంక కాలనీ వాసులతో చర్చిస్తున్న ఎంపీడీఓ

కరప: మండలం ఉప్పలంకలోని కాలనీ ఇటీవల కురిసిన వర్షాలకు ముంపుకు గురైంది. కాలనీ అంతా మోకాలి లోతు నీరునిలబడిపోవడంతో దోమలు వ్యాప్తి చెంది, అంటువ్యాధులు వ్యాప్తి చెందుతాయని, విషసర్పాలు ఇళ్లలోకి వస్తుండటంతో కాలనీవాసులు భయాందోళనలు చెందుతున్నారు. పారిశుద్ధ్య పనులు చేయించక, నీరు పోయేందుకు చర్యలు తీసుకోవడం లేదని కాలనీ ప్రజలు ఆరోపించారు. ఈ సమస్యపై ఈ నెల 26వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'ముంపులో ఉప్పలంక కాలనీ' అనే కథనంపై స్పందించిన ఎంపీడీఓ కె.అప్పారావు బుధవారం నుంచి పంచాయతీ, సచివాలయం సిబ్బందికి చెప్పి ఇంజిన్లతో నీరు తోడించే ఏర్పాటు చేయించారు. గురువారం ఎంపీడీఓ కాలనీని సందర్శించి, అక్కడి ప్రజలతో మాట్లాడి, తర్వాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది, గ్రామస్తులతో సమావేశమై కాలనీ సమస్యపై చర్చించి, తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు. తర్వాత ఎంపీడీఓ అప్పారావు విలేకరులతో మాట్లాడుతూ ఉప్పలంక కాలనీలో 152 మందికి పట్టాలివ్వగా, ఆ స్థలాలల్లో 30 శాతం లబ్ధిదారులే గృహ నిర్మాణాలు చేశారు. మిగిలిన ప్లాట్లు ఖాళీగా ఉండడంతో వర్షపు నీరు చేరినట్టు గుర్తించామన్నారు. కాలనీ పక్కనే ఉన్న లే అవుట్ యజమానితో మాట్లాడి కాలనీలోని నీటిని ఇంజిన్లతో తోడిస్తున్నట్టు తెలిపారు. వారం రోజుల్లో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి పట్టాలిచ్చిన స్థలాల్లో నీరు నిలబడకుండా చూడాలని, గృహ నిర్మాణాలు చేపట్టకపోతే పట్టాలు రద్దుచేసి అర్హులైన వారిని ఎంపికచేసి వేరే వారికి పట్టాలివ్వడం జరుగుతుందని లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చినట్టు ఎంపీడీఓ అప్పారావు వివరణ ఇచ్చారు. ఈఓ పీఆర్డీ బీఏ సత్యనారాయణ, వీఆర్వో ఎస్.వెంకటేశ్వర్లు, బొమ్మిడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాక్ సిరామిక్స్ కార్మికుల ఆందోళన



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ నుంచి తొలగించిన కార్మికులు గురువారం అర్ధ నగ్న ప్రదర్శన చేసి ఆ సంస్థ ముందు బైఠాయించారు. ప్రైవేటు పరిశ్రమల్లో కార్మికులను తొలగించే కార్యక్రమాన్ని మానుకోవాలని, వారికి సీఐటీయూ అండగా ఉంటుందని ఆ శాఖ జిల్లా ఉపాధ్యక్షుడు నీలపాల సూరిబాబు అన్నారు. గత 15 రోజు లుగా కార్మికులు ఫ్యాక్టరీ గేటు ఎదుట శాంతియుతంగా ఆందోళన చేస్తున్నా యజమాన్యం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బుధవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయని తెలిపారు. తొలగించిన కార్మికులకు మూడు నెలల జీతాలు ఇస్తామని యజమాన్యం చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు. తొలగించిన కార్మికులకు ఉద్యోగ వయసు దాటి పోవడంతో ఏ ఫ్యాక్టరీలోనూ ఉద్యోగం వచ్చే అవకాశం లేదన్నారు. తొలగించిన కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని చెప్పారు. కార్మికులకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్, పట్టణ కార్యదర్శి సురేష్, పెద్దాపురం అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు, ప్రజానాట్య మండలి కళాకారులు వీర్రాజు, కృష్ణ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, రాజబాబు, సతీష్‌కుమార్, గంగాధర్, శివనారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణా నిరోధించాలి

- నిఘా పెంచాలని ఆర్డీఓ ఇట్ల కిశోర్ ఆదేశం
- తహసీల్దార్లు, పోలీసు అధికారులతో సమీక్ష

కాకినాడ సిటీ: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం అక్రమంగా రవాణా అవుతున్నట్టు వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో నిఘా మరింత పటిష్టం చేయాలని ఆర్డీఓ ఇట్ల కిశోర్ అధికారులను ఆదేశించారు. గురువారం తహసీల్దార్లు, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దారులు, పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. చౌక ధరల దుకాణాలు, ఎండీయూ ఆపరేటర్లు, రైస్ మిల్లులపై విస్తృత తనిఖీలు నిర్వహించి, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. దీనికి సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు, పోలీస్ సిబ్బంది సమన్వయంతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆర్డీవో వివరించారు. కౌలు రైతుల సాగు హక్కు ధ్రువపత్రాలు నిర్ణీత గడువులో రైతులకు మంజూరు చేయాలని, సకాలంలో ధ్రువపత్రాలు మంజూరు చేయాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, పోలీస్ స్టేషన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రోటరీ బ్లడ్‌బ్యాంక్ సేవలు ప్రశంసనీయం

- ఎస్పీ సతీష్‌కుమార్
- ఘనంగా రక్తదాతల అభినందన సభ



ఎస్పీ సతీష్‌కుమార్‌ను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: ఆసుపత్రిలో ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగులకు తక్షణం రక్తం అందిస్తున్న రోటరీ బ్లడ్ బ్యాంక్ సేవలు ప్రశంసనీయమని ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. రోటరీ హాల్లో గురువారం రక్తదాతల అభినందన కార్యక్రమం ఘనంగా జరిగింది. రక్తం దొరక్క ఇబ్బంది పడిన పరిస్థితిని తాను స్వయంగా తన కుటుంబంలోనే చూశానని ఎస్పీ పేర్కొన్నారు. రోటరీ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు మాట్లాడుతూ రోటరీ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులలో బ్లడ్ బ్యాంక్ ఒకటన్నారు. బ్లడ్ బ్యాంక్ చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ ఈ సంస్థను స్థాపించి 27 ఏళ్లు పూర్తయ్యిందని, ఇప్పటి వరకు సుమారు లక్ష 40 వేల బ్లడ్ యూనిట్లు సేకరించామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్‌ను సత్కరించారు. అనంతరం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసిన ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షుడు రామకృష్ణ భాస్కరరాజు, శ్రీచైతన్య కళాశాల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం హరిప్రసాద్, రోటరీ క్లబ్ కాకినాడ గోల్డెన్ జూబ్లీ అధ్యక్షులు నరహరిశెట్టి రవికృష్ణలను ఘనంగా సత్కరించారు. క్లబ్ సభ్యులు ఉదయభాను, చందు, చార్మినార్ వర్మ, వీర్రాజు, మమతా శ్రీనివాస్, కర్రి అచ్యుతరెడ్డి, రవిరెడ్డి, టీవీ బాలకృష్ణ, నల్లమిల్లి మాచారెడ్డి, గోవిందరాజు పాల్గొన్నారు.

రక్తదాన ప్రోత్సాహకులకు సత్కారం

తాళ్లరేవు: గ్రామాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి అనేక యూనిట్ల రక్తాన్ని సేకరించి అత్యవసర సమయాల్లో ఎంతోమందికి ప్రాణదానం చేస్తున్న రక్తదాన ప్రోత్సాహకులను రోటరీ క్లబ్ ఘనంగా సత్కరించింది. గురువారం కాకినాడలో రోటరీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండలానికి చెందిన రక్తదాన ప్రోత్సాహకులు, జెడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్ సాగర్, ధూళిపూడి వెంకట రమణలను రోటరీ క్లబ్ ప్రతినిధులు రామకృష్ణ, ఎస్‌వీఎస్ రావు, పసుపులేటి కామరాజులు సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యదర్శి వర్మ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించి ప్రోత్సహిస్తున్న వారిని సత్కరించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. తమ క్లబ్ ద్వారా గత సంవత్సరంలో 5 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించామన్నారు. ట్రెజరర్ వీర్రాజు పాల్గొన్నారు.

ఘనంగా సూర్యనారాయణ స్వామి గ్రామోత్సవం

గోకవరం: గ్రామంలో ఉషాపద్మినీ ఛాయా సమేత సూర్యనారాయణస్వామి గ్రామోత్సవం గురువారం వైభవంగా జరిగింది. స్థానిక వెలమపేటలో సనాతన ధర్మ ప్రబోధన స్వచ్ఛంద సమితి ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనేక మంది మహిళలు పాల్గొని భక్తి గీతాలు ఆలపించారు. మేళతాళాల నడుమ నిర్వహించిన ఈ ఊరేగింపులో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని హారతులు సమర్పించారు. కార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు, ఉపాధ్యక్షుడు అక్షింతల రాజా, ప్రధాన కార్యదర్శి దోసపాటి సుబ్బారావు, పిల్లంగోరు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు తక్షణమే చెల్లించాలి

తాళ్లరేవు: ఉపాధి హామీ వేతనదారులకు బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పటవల గ్రామ పంచాయతీ వద్ద జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభలో ఉపాధి వేతనదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఈశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో కలసి సామాజిక తనిఖీ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఉపాధి హామీ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆయన అన్నారు. ఇప్పటికైనా వేతనదారుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు.

చినుకు పడితే చీదరే..

- పూడికతో నిండిపోయిన డ్రైన్లు
- వర్షాలు కురుస్తుండడంతో పొంచి ఉన్న ముంపు బెడద



కాకినాడ రూరల్ సర్పవరం రోడ్డులో రమణయ్యపేట వద్ద పూడిక, తుప్పలతో నిండిన పేట కాలువ

కాకినాడ రూరల్: వానాకాలం వచ్చిందంటే గ్రామాల్లో మురుగు, బురద, పల్లపు ప్రాంతాల్లో ముంపు సమస్యలు సర్వ సాధారణం. ముఖ్యంగా తుపానుల సమయంలో ముసురుతో రెండు మూడు రోజుల పాటు వర్షం పడితే కాకినాడ, పరిసర ప్రాంతాలు జలమయమవుతాయి. నీరు పోయే మార్గం సక్రమంగా లేక పల్లపు ప్రాంతాలకు ఈ పరిస్థితి ఏర్పడుతోంది. గతంలో తిమ్మాపురం, రమణయ్యపేట తదితర ప్రాంతాల్లో మొలలోతు నీరు రావడంతో ఇళ్లలోకి నీరు చేరుకుని జనాలు ఇబ్బందులు పడిన సంగతి విదితమే. అప్పట్లో చిన్నపాటి పడవలపై పర్యటించి ఆహార పొట్లాలను అందించిన సంగతి ఇప్పటికీ చాలా మందికి గుర్తుండే ఉంటుంది. మూడేళ్లుగా ఆ సమస్య లేకపోయినప్పటికీ వానా కాలం పూర్తయ్యే వరకు తేలికగా తీసుకోవడానికి లేదు. కాకినాడ రూరల్‌తో పాటు అర్బన్ లోని మధురానగర్ తదితర ప్రాంతాలను ముంపునకు గురి చేసే మురుగు కాల్వల పూడిక తీయాల్సి ఉంది. కాకినాడ రూరల్ పరిధిలో సుమారు 80 కిలో మీటర్ల మేర డ్రైనేజీలు విస్తరించి ఉన్నాయి. వీటిలో మేజర్ డ్రైన్లు 35 కిలో మీటర్లు, మీడియం డ్రైన్లు 25 కిలో మీటర్లు, మైనర్ డ్రైన్లు 20 కిలో మీటర్ల మేర ఉన్నాయి. వీటిలో ప్రధానంగా పనసపాడు నుంచి సర్పవరం మీదుగా ప్రతాప్‌నగర్ బ్రిడ్జి నుంచి ఈస్ట్ ఏలేరు కలిసే గాడేరు డ్రైన్ ఒకటి. అలాగే తిమ్మాపురం నుంచి రమణయ్యపేట సుభా నికేతన్ మీదుగా మధురానగర్ వరకు విస్తరించిన పేట కాల్వ, ఏపీ త్రయం మీదుగా చీడిగ, ఇంద్రపాలెం తదితర గ్రామాల్లో విస్తరించి ఉన్న బిక్కవోలు మేజర్ డ్రైన్, ఈస్ట్ ఏలేరు తదితర కాల్వలు మురుగు కాల్వలుగా ఉన్నాయి.

ఆయా కాల్వల ద్వారానే మురుగునీటితో పాటు వాన నీరు పోవాల్సి ఉంది. ప్రస్తుతం ఆయా కాల్వలు పూడికతో నిండిపోయాయి. గుర్రపు డెక్క, తుప్పలతో నిండిపోయాయి. వర్షాలు ప్రారంభం కావడంతో యుద్ధ ప్రతిపాదికన డ్రెయిన్లను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

గ్రామాలను ఆనుకుని మురుగు కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థా లను విడిచిపెట్టం ప్రమాదభరితంగా మారుతోంది. భోజనాలకు వినియోగించే ప్లేట్లు, డిస్పోజబుల్ గ్లాసులు, వినియోగించిన ప్లాస్టిక్ కవర్లు ఎక్కువగా కాల్వల్లో దర్శనమిస్తున్నాయి. వీటి వల్ల మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు కలగడమే కాకుండా పూడికలు ఏర్పడుతున్నాయి. కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా పంచాయతీ, ఇరిగేషన్, డ్రైన్ల శాఖ అధికారులు ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సి ఉంది.

డ్రెయిన్లు శుభ్రం చేసేందుకు ప్రతిపాదనలు చేశాం

కాకినాడ రూరల్ పరిధిలోని పేట కాల్వ, గాడేరు, బిక్కవోలు మేజర్ డ్రైన్, రైట్ ఆర్మ్, ఈస్ట్ ఏలేరు తదితర వాటిలో పూటిక తీతకు ఏటా మాదిరిగా ప్రతిపాదనలు చేశాం, రూ.15 లక్షలతో ప్రతిపాదనలు చేయడంతో పనులు చేపట్టాల్సి ఉంది.

– వరప్రసాద్, ఇరిగేషన్ (డ్రైన్స్) జేఈ. కాకినాడ రూరల్